మానవుడు

[కథానిక]

*

శ్రీ పంతుల శ్రీరామశాస్త్రి

'అంతవరకూ మీరు ఒంటరిగా ఉండగలరా?' అంది సువర్ణ.

'ఎంతవరకు?' అన్నాడు సహజంగానే సుందరం.

'మేము వెళితే తిరిగివచ్చేసరికి బాగా రాత్రి అయిపోతుందికాబోలు' అంది కొంచెం కష్టపడుతూ సువర్ణ. సుందరం జవాబు చెప్పేలోపున ఆమె మళ్ళీ అందుకొని, చెల్లెలితో 'పద్మా, నేను రాలేను, మీరంతా వెళ్ళకూడదూ?' అంది.

మొగంలో ఆశాభంగం తొణికిసలాడగా, పద్మ 'అయితే నేనూ వెళ్ళను—ఎప్పుడూ ఏం సినీమా మొగం చూడలేనా ఏమిటి? ఏమో నలుగురం కలిసి సరదాగా తిరిగివద్దామని' అంటూ ఫుర్రున వెళ్ళిపోయింది.

కృతకస్మితాన్ని సహజంగా ప్రదర్శించాలనే ప్రయత్నంతో 'అదేమిటి సువర్ణా, వాళ్ళింట్లో కొత్త ఇదిగా ఉన్నంతలో, వాళ్ళందరి ఉత్సాహం భంగం చెయ్యటం బాగుంటుందా' అన్నాడు సుందరం.

'నేను వెళ్ళిపోతే మీకు ఒంటరిగా ఊసుపోతుందా' అంది, నిజంగా బాధపడుతూ సువర్ణ.

'ఓస్, ఈమాత్రానికేనా, ఇప్పుడు మాత్ర వేసుకున్నానా, రాత్రి తొమ్మిదిగంటలలోపున మళ్ళీ ఏమీ అక్కరలేదు - ఈలోపుని నారాయణశాస్త్రిగారు (వైద్యుడు) వస్తారుకదా—అంతదాకా నేనిలా ఇవేవో పుస్తకాలు తిరగేస్తూ ఉంటాను.'

'అదుగో, అందుకే నేను వెళ్ళనంటున్నాను—మీరు మళ్ళీ అనవసరంగా మెదడుకి అలసట—'

'పోనీఅయితే, అంతదాకా నేనే చెస్ ఆడుకుంటూ ఉంటాను—అప్పుడు నీకంత జ్వరంగా ఉండగానే టెన్నిసు మేచికి నేను వెళ్ళిపోలేదూ' అని సుందరం ఆమెసమాధానాన్ని వినిపించుకోకుండానే 'పద్మా, పద్మా' అని పిలిచేడు.

అంతవరకూ పద్మముఖాన్ని క్రమ్ముకొనిఉన్న నిరుత్సాహనీరదములు విరళములయేయి.

'మీ అక్కయ్యకూడా బయలుదేరుతుంది పద్మా'

బలవంతంగా సువర్ణ చెయ్యిపట్టుకొని 'పోనీ, మాకోసం కాకపోతే మానిపోయెను, బావ ఇంతలా చెప్తున్నారనేనా బయలుదేరుమా' అంటూ నడిపించసాగింది పద్మ.

గదిగుమ్మందగ్గర వెనక్కితిరిగి, 'మీరు పుస్తకాలు చదవనంటేనే నేను వెళ్తా'నంది సువర్ణ.

'అలాగేలే' అన్నాడు సుందరం.

'అబ్బ, ఏమి జాగ్రత్త అమ్మా, కందిపోతారు కాబోలు పుస్తకం చదివినమాత్రంలో బావగారు' అంటూ అక్కయ్యను తీసుకొని వెళ్ళిపోయింది పద్మ.

ఒక అయిదునిమిషాలలో కారు సరభసంగా, తనకు సహజమయిన మధురమూ, కఠోరమూ అయిన ధ్వనితో బయలుదేరింది. చప్పుడు ఆగిపోయినతర్వాత ఒక అయిదునిమిషాలు వెల్లకిలాపడుకున్నాడు సుందరం.

సముద్రంలో తరంగాలు లేకుండా చేయడము ఎంత కష్టమో, మానవుడి మనస్సముద్రంలో భావనాతరంగాలు ఏర్పడకుండా చెయ్యడమూ అంతకష్టమే.

ఏపనీ లేకుండా పడుకొని మనస్సును అరికట్టడం సాధ్యంకాదని, లేచి కూర్చొని, సువర్ణదగ్గర ఒప్పుకున్నట్లుగా, పేకదస్తా తీసేడు పేషెన్స ఆడుకుందికి. పేషెన్సఆడైనా ప్రక్కను సోత్సాహంగా సంవీక్షించే మనిషి ఉంటేనే కాలక్షేపంగా తోస్తుంది.

సుందరానికి తన అశక్తి బాగా తెలుసును. పేకముక్కలు టేబిలుమీదికి విసరి, కళ్ళు గట్టిగా మూసుకొన్నాడు. కళ్లను ఏమీ చూడకుండా నిబంధించినట్లుగానే మనస్సునుకూడా నిబంధించవలెనని. ఫలితం లేకపోయింది. తానేమో ఎవరికీ అక్కరలేనివాడుగానూ, ఎందుకూ పనికిరానివాడుగానూ, ఇంకా ఏమేమో అల్లుకొని పోతున్నది మనస్సు; దానిని నిబంధించే సంకల్పా, అదుపులో ఉంచే కళ్ళేమూ కానరాలేదు అతనికి.

ఇంతకంటె తలనొప్పి ఎక్కువయినాసరే, ఏమయినాసరే మంచిదని, తాను సువర్ణకు పుస్తకం చదవనని హామీ ఇచ్చిన మాట జ్ఞాపకం ఉండికూడా పుస్తకం తీసేడు గత్యంతరం లేక.

ఎథిల్ మేనిన్ నవల 'పిల్‌గ్రిమ్సు' (యాత్రికులు) వచ్చింది చేతికి. అదివర కెన్నోమార్లు చదివినదే కావడంవల్ల మధ్యను మొదలుపెట్టేడు. రెండుమూడు కాకితాలు చాలా త్వరగా తిరిగేయి. అక్కడితో ఆ ప్రకరణం అయిపోయింది. మళ్ళీ మనస్సు తన స్వంతమార్గంలో సంచరించసాగింది. అతని ప్రయత్నం అక్కరలేకుండా పుస్తకం మూసుకొని పోయింది.

సుమారు ఆరుగంటల ప్రాంతంలో వైద్యుడు నారాయణశాస్త్రిగారు వచ్చేరని నౌఖరు కూర్మయ్య చెప్పేడు. ఆ సందర్భంలో ఆయనను చూడలేకపోవడానికి కారణం పుస్తకపఠనంలోని తన్మయత్వంకాక, అతని మానసికోద్వేగమే కారణమని చెప్పవచ్చును.

కారులో వెళ్లినవాళ్లు తిరిగి వచ్చేసరికి రాత్రి తొమ్మిదిన్నరయింది. అదయినా సువర్ణ బలవంతంవల్లనే. అసలు బయలుదేరినది లగాయతు ఆమె ఎవ్వరితోనూ సరిగా మాట్లాడలేదు. పైగా సినీమా మొదలయిన దగ్గరనుండి 'నాకు చికాకుగా ఉంది; మీరంతా ఉండండి, నేను వెళ్లిపోతా'ననడం మొదలుపెట్టింది.

ఆమెను మరిపించాలని పద్మా, ఆమెభర్త వసంతం చాలా చాలా యత్నించారు వారి యత్నము అధికమవుతున్నకొద్దీ ఆమెతొందర ఎక్కువకాసాగింది. చిట్టచివరకు ఇంటర్వెల్ కాగానే అందరూ లేచి పోయేరు.

ఇంటిని సమీపిస్తున్నకొద్దీ ఆమెలో ఒకింత ఉత్సాహం కలిగినట్లయింది. అది కేవలం తలనొప్పి తగ్గటంవల్లనో, త్వరత్వరగా సమీపించటంవల్లనో విడమర్చటం చాలాకష్టం.

పద్మకు ఏవిషయమూన్నీ దాచిపెట్టుకోవడం చేతకాదు. 'ఇంటికి వచ్చేసరికల్లా, అక్కయ్యకు సగం తలనొప్పి తగ్గిపోయింది. ఇంక బావగారి ముఖారవింద సందర్శనంతో ఆ ఉన్నది కాస్తా మాయమవుతుంది కాబోలు' అంది.

చెల్లె లేమంటున్నదో సరిగా వినిపించుకోకుండానే, సువర్ణ మేడమెట్లెక్కిపోయింది. గది తలుపు లోపున గడియ వేసిఉండడం ఆమెకు ఉల్లాసాన్నే కలిగించింది.

మృదువుగా తలుపుతట్టుతూ, సన్నని తీయని నవ్వుతో—'ఆఁ, దొరికిపోయేరులెండి దొంగతనంలో-తొందరగా తలుపుతీస్తే వాగ్దానభంగం చేసి పుస్తకం చదువుతున్నందుకు శిక్షతగ్గుతుంది.' అంది.

లోపల సుందరానికయితే తక్షణం తలుపుతీయాలనే అనిపించిందికాని, అతని కళ్ళు - అవి తుడుస్తున్నకొద్దీ మరీ దుర్బలంగా నీళ్లుకారుస్తున్నాయి. ఎట్టకేలకు సర్దుకొని, మూసిఉన్న రెండు పుస్తకాలనూ విప్పి మంచంమీద పడేసి తలుపుతీసేడు.

ఎన్నో సంవత్సరాల వియోగానంతరం కలుసుకున్నట్లుగా రెండుచేతులతోనూ ఆమె అతన్ని తనకు

అతిసమీపంగా పట్టుకొని, మంచంవద్దకు తీసుకొనివెళ్లి పడుకోబెట్టి, లాలనగా, 'నేనందుకే వెళ్లనన్నాను. చూడండి, మీ ఒళ్లు ఎంత వేడిగా ఉందో; సుమారు నూరైనా ఉంటుంది; నారాయణశాస్త్రిగారేమన్నారు?'

'ఏమనడానికి ఏముంది నావంట్లో ఏమీ లేందే? మందెందుకు, మేడమీదికి రానక్కరలేదని కబురు చేసేను.'

'మీ కింతకోపం వస్తుందని తెలిస్తే నేను వెళ్లి ఉండేదాన్నా?' అని, అతని పిలుపును వినిపించుకోకుండానే వరండాలోకి వెళ్లి 'కూర్మయ్యా, కూర్మయ్యా, వేగం వెళ్లి నారాయణశాస్త్రిగారిని పిల్చుకొనిరా' అని మళ్లీ గదిలోనికి వచ్చింది.

'పోనీ, మీ కిష్టం లేకపోతే మందు వద్దులెండి గాని, ఇదుగో చూసేరా, మీకొక మంచి చిత్రం తెచ్చేను' అంది తాను తెచ్చిన పూలను టేబిలుమీది పూలకుండులో సర్దుతూ. అతడు మళ్ళీ సర్దుకొని, 'ఉఁహుఁ, ఇలా కాదు. ఇలారా' అన్నాడు సాభిప్రాయంగా.

ఆమె సస్మితంగా, సపుష్పంగా దగ్గరకు వచ్చి, 'మీరు అల్లరిచెయ్యకుండా మందు తీసుకుంటేనే' అంది. అతడామె తల్లో పూలు తురుముతూ, 'అబ్బ, నాకేం వంట్లో చికాకు లేందే మందెందుకు చెప్పు?' అన్నాడు కొంతవరకు ఇష్టాన్ని సూచిస్తూ. 'లేకపోవడమేమిటి; మీరు మునపటిలాగా ఉండగలుగుతున్నారా? ఏదో మనకు తెలియని చికాకు ఉండే ఉంటుంది'—

'ఏమయినా, నాకు మందులమీద నమ్మకం లేదుకదూ.'

'పోనీ, నాతృప్తికోసం—'

'అలాగేలే' అంటూ అతడు ఎప్పటి నిరుత్సాహంతో నడుము వాల్చేడు.

ఆమె, ఏదో అలభ్యమయినదానికోసం మారాము చేసే పసిపాపను తల్లి స్తన్యమిచ్చి మరిపించేట్లుగా, అతని పెదవులూ బుగ్గలూ ముద్దుపెట్టుకొని, 'ఇప్పటికి నాకు ఎన్ని బాకీపడ్డారో తెలుసునా?' అంటూ నిజంగా లెక్క పెడుతున్నట్లుగానే మొగంపెట్టింది.

తన చిరనిరుత్సాహానికి లొంగని ఉల్లాసోద్రేకాలతో అతడు చివాలున లేచి, 'అవన్నీ దీనితో చెల్లు' అన్నాడు తనివితీరా బాకీతీరుస్తూ.

అంతలో గదిఅవతలినుండి కూర్మయ్య, 'భోజనం చేస్తున్నారట, ఇప్పుడే రెండు నిమిట్లలో వస్తామన్నా' రన్నాడు.

నారాయణశాస్త్రిగారు రోగలక్షణాలను ఎంత జాగ్రత్తగా పరికిస్తాడో, రోగినికూడా అంత శ్రద్ధతోను పరిశీలిస్తాడు. ఆయన 'మరేమీ విశేషం లేదు, ఆమువాతం మీద చిన్న జ్వరం ఉంది; ఈ చూర్ణం వెన్నాపంచదారలో కలిపి తీసుకుంటే చాలును. ఇక పథ్యం ఇచ్ఛాపథ్యమే—' అని వెళ్ళిపోతూ, 'అమ్మా సువర్ణమ్మా' అని పిలిచేడు, రోగం లేని రోగినిగురించి ఇంకా ఏయే శ్రద్ధ తీసుకోవాలో బోధపరచడానికి.

ఆరాత్రి సుందరం మామూలుగానే భోజనం చేసేడు.

భోజనసమయంలో అశనికీ, వసంతానికీ నడుమ ఆరంభమయిన కళాచర్చ (కళ కళకోసమా, మరొకందుకా అని చర్చ) రాత్రి రెండుగంటలయినా తెగలేదు.

ఇటీవల కొన్ని నెలలుగా సుందరం ఎన్నడూ అంత తన్మయత్వంతో ప్రసంగించ లేదు. అతని ఆరోగ్యానికి మంచిది కాదేమోనన్న అనుమానం కలవరపరుస్తున్నా, ఎల్లాగో ఏర్పడిన ఆత్మవిస్మృతికారకమయిన వాదతైక్ష్ణ్యముకు భంగపరచడానికి సాహసించ లేకపోయింది సువర్ణ.

పద్మకు అన్నివిషయాలూ మాట్లాడ్డం కులాసాయే; కాని వాటిని చర్చలక్రింద దింపేసి యుక్తులూ ప్రతియుక్తులూ పన్నుతూ కూర్చుంటేమాత్రం పరమఅసహ్యం. ఆమె చర్చను ముగించటానికి చాలాచాలా యత్నించింది నిష్ప్రయోజనంగా; చిట్టచివరికి 'ఎన్ని అంగుళాల ఎత్తు కల మడమల జోడు తొడుక్కోవడము ఫాషనో, ఏరకంచీరకు ఏరకంజాకెట్టు ఫాషనో

ఏ సినీమాతారకు ఏయే ప్రత్యేక అభిరుచు లున్నాయో అన్న విషయం చెప్పనీయాంకయియినప్పుడు నీకే అర్థ తుత్వం గే; ఇల్లాంటి గోడవలు నీకెందుకు ?' అన్న కటువయిన సుందరం మందలింపుతో సరోషంగా వెళ్ళి పడుకుంది. సుందరం తన భార్యను అంత కేవలం ఘామన్న మనిషిగా పరిగణించడమే కష్టమనిపించి చర్చ మరీ తీవ్రంగా సాగించేడు వసంతం.

సువర్ణ తన గదిలోనుండే చర్చ ప్రత్యుత్తరమూ వింటున్నది— సుందరానికి పడుకోబోయేముందు వేసుకోవలసిన మందూ, తాగవలసిన పాలూ ఇవ్వాలని ఆమె చాలాసేపు మేలుకొనిఉందికాని, ఆమెకు తెలియకుండానే నిద్రపట్టింది.

మొట్టమొదట్లో ఎప్పుడూ అనేకమాదిరిగా ఎవరితోనూ మాట్లాడని మనిషి తానెతో తెలుసుకున్నానన్న విషయాల్లో తనతో వాదించటమూ అని అభిమానపడ్డాడు వసంతం. కాని క్రమంగా (సహృదయుడు కావడంవల్ల) ఎదుటిమనిషి తనకంటే ఎన్నో విషయాల్లో స్థిరమయిన అభిప్రాయాలు కలవాడే కాక, అభిప్రాయాలను నిశితంగా వాక్కులలో వెలార్చటంలోకూడా ఎన్నో ఇంతలు సౌలభ్యము కలవాడని గ్రహించి, తన వాదధోరణిని ఉపసంహరించుకొని, కేవలం శ్రోతగా తయారయేడు. ఎంతకూ సుందరం వాగ్వాదానికి ఒక అంతు లేకపోవడంతో, వసంతం 'సుమారు రెండవుతూంది, మీ ఆరోగ్యానికి భంగం.— ఉదయం మళ్ళీ మాట్లాడుకుందాం' అంటూ ఆనకట్ట వేసేడు ప్రాసంగిక స్రోతస్సుకి.

నిద్రపోతూఉన్న సువర్ణను మేలుకొలపాలన్న తలపును త్రోసిరాజని, వెళ్ళి తన మంచంమీద కూర్చున్నాడు సుందరం.

— ఆమెమొగంమీది చిరుచెమట తొలగిపోయేలాగ విసరాలనిమాత్రమే అనుకొని అతడు ఆమెమంచంమీద కూర్చున్నాడు. విసరుతూఉండగా అతనికి స్మృతిలోనికి వచ్చింది తాను నిద్రపోయేముందు మందు వేసుకోవాలని. కేవలం మందుమీది భక్తిచేతనే ఆమెను మేల్కొలుపుతున్నానని అతడు తననుతాను నమ్మించుకుందికి చాలా కష్టపడ్డాడు— మనుష్యులను అతిగా లోబరచుకొన్న నాగరకతాప్రభావమువల్లనో ఏమో కోరికలు ఎంత సహజంగా బలంగా కలుగుతాయో వాటిని బైటపడకుండా (లేకుండా కాదు) అచ్ఛాదించాలనే శాస్త్రీయమూ అంత సామాన్యంగానే ఆక్రమించుకొంటున్నది.

మందు ఒక వ్యాజముమాత్రమే. ఆమె లేచిన తరవాత మందుఅవసరమే లేదు.

'సువర్ణా, నువ్వు నన్ను చూసి అసహ్యించుకోవడం లేదూ ?'

'అబ్బ, మీ రల్లాటిమాట లంటే నేను ఏమయినా అయిపోవాలిగాని, మరి భరించలేను' అని ఆమె అతన్ని మరి మాట్లాడనివ్వలేదు. అతడూ కొంతవరకు సంబాళించుకొని మరి మాట్లాడలేదు. రెండు హృదయాలూ ఏకమయి ఊపిరితీసేయి ఆరాత్రి నిర్విచారంగా, నిరాలోచనంగా.

౨

కళాశాలాజీవితాన్ని ప్రశంసించేవారూ, బాధగా భావించేవారూకూడా ఉన్నారు. కాని, కష్టసుఖాల మాట ఎల్లా ఉన్నా అందులో ఎన్నెన్నో మధురమయిన కలయికలకు, ప్రణయాలకు దోహదప్రాయములయిన అనేక అవకాశాలున్నాయి. కాని ఎన్నయితే సావకాశాలున్నాయో అంతకు పదింతల అడ్డంకులూ, వ్యతిరేకభావనలూ ఉండటంవల్ల అక్కడ ఉద్భవించవలసిన ప్రణయకందళములు ఊహాంకురములుగా మాత్రమే అంతరించవలసివస్తుంది. అయితే, ఎన్నెన్నో ప్రత్యేక పరిస్థితుల సమ్మేళనమువల్ల, ఎక్కడో ఒక సందర్భములో ప్రణయాంకురము వైవాహిక దోహదంతో దాంపత్యజీవితవృక్షముగా విస్తరించగలదు. అటువంటి బహుపరిస్థితుల సమైక్యమువలన సమకూడినదే సువర్ణాసుందరముల వైవాహికబంధము.

చిన్నతనంలోనే తల్లిదండ్రు లిద్దరూ పోయేరు సుందరానికి. ఒక్క మేనత్తవినా కుటుంబంలోని ఎవ్వరికీ సుందరం కాలేజీచదువంటే ఇష్టంలేదు. చిట్టచివరి పిల్లవాడుకదా అనేకాక సుందరంచురుకుదనంవల్ల

కూడా అతడంటే ఆమెకు విపరీతమయిన అభిమానం. ఆవిడ సుందరంచదువు ఎక్కడా ఆగడానికి వీల్లేదని అతిపట్టుదలతో నిర్వహించింది. తుట్టతుదకు బి. యే. లో ప్రవేశించిన నెల్లాళ్లకు ఆవిడ పోవడంతో అదివరకల్లా ఉత్తరం రాసిపడేసే పరికల్లా వంద యాభైగా వచ్చే డబ్బు ఎంతకూ రాకపోవడము చాలా ఆశ్చర్యం వేసింది. 'మిక్కిలి అవసరంగా ఉంది, తొందరగా డబ్బు పంపించవలసింది' అని తంతి ఇచ్చాడు. అప్పటికీ డబ్బురాలేదు. 'ఇక్కడ ఏమీ సర్దుబాటు కాలేదు, ప్రస్తుతానికి చదువు కట్టిపెట్టిరావడం మంచిది' అని, వారంరోజులు భార్యతో సంప్రదించి, ఉత్తరం రాసేడు. కాని, ఒక ఆరు నెల్లు చదువు మాని, సమిష్టికుటుంబంలో మెలగటం, అందులోనూ, ఇదివరకులా తనను కడుపులో పెట్టుకొని కనిపెట్టేవారు లేకుండా ఉండడంకంటే ఆత్మహత్య చాలా నయమనుకున్నాడు సుందరం. తానేమో ఒక కంబారివాడికంటే హీనంగా పనిచేయవలసిరావడమే కాదు, అన్ని విషయాల్లోనూ వాడిపాటి స్వేచ్ఛా, స్వాతంత్ర్యమూకూడా లేకపోవడము అతనికి అగమ్యగోచరంగా ఉండేది. పైగా, వాళ్ల నాన్నగారిని తెలిసినవారందరూ సుందరాన్ని చూసి, కరుణాస్వరంతో 'పాపం, కృష్ణారావుపంతులుగారే బ్రతికిఉంటేనా, ఇంత తెలివయిన కుఱ్ఱాణ్ణి పొలంపని చేయనిచ్చేవారా!' అనేవారు. తాను పడుతున్న కష్టంకంటే ఈ సానుభూతివాక్యాలే అతని హృదయానికి గాటంగా నాటుకొనేవి.

అప్పట్లో సుందరానికి అప్పారావు ఒక్కడే స్నేహితుడు. అతను రోజూ అంటూఉండేవాడు— 'సుందరం, నీకు తెలుసునుకదా, ఆమెతరఫున ఎల్లాంటి అభ్యంతరమూ లేదు. నాలోనే ఉంది చిక్కంతా. లేవదీసుకొనిపోతే మా వాళ్లు ఒక్కదమ్మిడీయేనా ఇవ్వకపోవడమే కాదు, ఒక్కపూట తిండయినా పెట్టరు. తీరా సాహసిస్తే, నానాఅవస్థలూ పడి అదుపు ఆజ్ఞలు పెట్టేవాళ్లకు లొంగిపోకుండా ఉండగలమో లేమో అని భయం' అని.

అతని భయాన్ని సుందరం తన అనుమానాలతో, అనిశ్చయాలతో మరీఎక్కువ చేసేవాడు. క్రమక్రమంగా అప్పారావు సుందరంఅభిప్రాయాలకు లొంగిపోయినట్టే కనిపించేడు. అరుంధతిఊసే ఎత్తడం మానేశాడు. కాని, హఠాత్తుగా ఒక్కనాడు తెల్లవారగానే వినిపించిన వింతతో సుందరం విస్తుబోయాడు. అప్పారావు అరుంధతిని లేవదీసుకొని వెళ్లిపోయేడు. అందులోనూ, ఆమె జాగ్రత్తగా, వెంటనే ఎవ్వరూ వెతకడానికి బయలుదేరనవసరం లేకుండా, తన నగలన్నీ తీసి భద్రంగా పెట్టెలో ఉంచి మరీ వెళ్లిపోయింది. బంధుసముద్రులు ఆమె వెళ్లిపోవడమే ఒక పెద్దబరువు తేలికయినట్లు భావించేరు.

ప్రత్యక్షంగా తనకు ఏవిధమయిన సంబంధమూ లేని ఈ సంఘటనతో సుందరంలో ఎక్కడలేని ధైర్యసాహసాలూ పుట్టుకొచ్చాయి. అందరివల్లా నిరసించబడుతూ, ఆ జన్మాంతమూ వైధవ్యవ్యథ ననుభవించవలసిన అరుంధతి—ఒకనాడు ఆత్మహత్యకు కూడా సంసిద్ధురాలయి తనవలన రక్షించబడిన అరుంధతి—ఆమెలోనే ఇంతటి ధైర్యసాహసాలు కలగటానికి వీలున్నప్పుడు, తానామెకంటే అన్ని విషయాల్లోనూ ఎంతో ఎక్కువవాడననుకుంటూకూడా ఎందుకు ఏమీ చేతకానట్లుగా ఉండిపోవాలి?

పెద్దన్నయ్య బండివాళ్లకు ఇమ్మని ఇచ్చిన ఆరు రూపాయిలతోనూ బి. యే. చదవటానికి పట్నం చేరుకొన్నాడు సుందరం. అతని సాహసం వృథాపోలేదు. ఆ సాహసాతిరేకంలో అతనికి డబ్బువచ్చే ఏపనిఅయినా క్షుద్రముగా తోచలేదు. పూర్వం ఎటువంటివాళ్లనయితే అతినికృష్టంగా చూసేవాడో, ఇప్పుడు అటువంటివాళ్లతోనే నేస్తం ఆరంభించేడు. సెప్టెంబరుపరీక్షలకి వెళ్లే కొందరు విద్యార్థులకు పరీక్షల విషయంలో చాలామంది ప్రొఫెసర్లుసైతం చెయ్యలేని ఉపకారం చేసేడు. పైగా అతడి టెన్నిసు, చదరంగం, కవిత్వధోరణి ఇవన్నీ అతిసూక్ష్మంగా అతన్ని ఊళ్లోని పదిమందితోనూ పరిచయం చేసేయి. ఎవరయినా ఏమిటి చేస్తున్నావని అడిగితే యథార్థస్థితిని (ముఖ్యంగా ప్రస్తుతపు పేదరికాన్ని) ఒప్పుకుందికి ఏమీ అభిమానంగా ఉండేది కాదు. ఎల్లా అయితేనేం, మళ్లీ సంవత్సరం అందరి సాయంతోనూ,

కాలేజీ ప్రిన్సిపాలు సుబ్బరామయ్యగారి అనుగ్రహంవల్లా అతడి బి. యే. చదువు ఆర్థికంగా అట్టే కష్టంగా తోచలేదు.

బి. యే. చదువుతూఉండగానే సువర్ణ అతనిని తెలుసుకోవడం సంభవించింది. అంటే ఆమె అతన్ని తెలుసుకున్నంతబాగా అతడామెనుగూర్చి తెలుసుకోలేదు. క్లాసంతటికీ మిక్కిలి తెలివయినవాడని కాదుగాని అతని వక్తృత్వచమత్కృతీ, టెన్నిసులోని నేర్పూ, కాలేజీమేగజైనులోని పద్యాలూ ఇవన్నీ కలిసి ఆమెదృష్టిలో అతన్ని స్థిరంగా నాటుకొనిపోయేలాగ చేసేయి. కాని అతనికిమాత్రం ఆమెప్రసక్తేలేదు.

ఆమె తనంతట తాను ఎవరితోనూ మాట్లాడదుగాని, ఎవరయినా మాట్లాడాలని ఉత్సాహం చూపిస్తే మాత్రం మాట్లాడ్డంలో వెనుకంజవేసేదికాదు. కాని, సుందరంమాత్రం అటువంటి ఆతృత ఎన్నడూ చూపెట్టకపోవడమేకాదు, ఆమె ఒకింత ఆ ధోరణిలో ఉన్నా, ఏదో మిక్కిలి తొందరపని ఉన్నట్టు వెళ్లిపోయేవాడు.

అదివరకల్లా వాళ్ల కాలేజీమేగజైనులో ఎప్పుడూ సుందరంపద్యాలదే మొదటిస్థానము. కాని ఒకపర్యాయము ఆ స్థానాన్ని సువర్ణగేయాలు ఆక్రమించుకోవడం కాలేజీ విద్యార్థులలో కొంత అలజడికి కారణభూత మయింది. 'ఎంతయినా గర్లుస్టూడెంటుకి ఉన్న ప్రిఫరెన్సు (ఎంపకము) మనకి ఉండదోయి' అన్నారు కొందరు సుందరంఅనుయాయులు. సుందరంమాత్రం ఒప్పుకోలేదు. 'మనని మెచ్చుకొన్నప్పుడు సరియయిన ఎంపకమూ, మరొకప్పుడు వేరొకటీనా ? నిశ్చయంగా ఆ గేయాల్లో ఎంతయినా కవిత్వం ఉంది. నాది కేవలం గణబద్ధమయిన వచనం' అన్నాడు ధీమాగా.

ఆ తరవాత కొద్దిరోజుల్లో మళ్లీ తన ఆధిక్యతను నిలబెట్టుకోగలిగేడు సుందరం. పద్యరచన పోటీలో అతనిది మొదటిబహుమతి; ఆమెది రెండవబహుమతీని. అయితే ఆ ఓటమివల్ల సువర్ణకు ఆనందమే ఎక్కువగా కలిగింది.

అప్పటికప్పుడే వాళ్ల యూనివర్సిటీపరీక్షలు చాలా దగ్గరపడ్డాయి. సువర్ణ ప్రతిరోజూ ఏదో నవల చదువుతూనో, పద్యాలు వ్రాస్తూనో గడిపివేస్తూ, ఇవాళకు అయిపోయింది, రేపటినుండి సరిగా కార్యక్రమం ప్రకారం చదువు జరిగితీరాలనుకొనేది. కాని, ప్రతిరోజూ ఇల్లాటిదే ఏదో తప్పనిసరిపనివచ్చి, పఠనకార్యక్రమం వెనకపడేది.

ఆమె మేనమామా, సంరక్షకుడూ అయిన సాంబమూర్తి బహు మితభాషి. ఆయన ఏవేవో పూర్వచరిత్రలనుగురించిగాని, చదరంగంగురించిగాని తప్ప మరి వేటిగురించీ మాట్లాడలేడు. చదరంగమనేదే లేకపోతే ఆయనకు వర్తమానకాలమనేదే ఉండకపోవునేమో అన్నంత స్తబ్ధంగా ఉండేవాడు. కాని రావలసిన రాబడిని చేజిక్కించుకొనే సందర్భంలోమాత్రం ఆయన చాకచక్యం అపారమయినది.

ఆయన రెండుమూడురోజులనుండి ఏకదీక్షగా క్లబ్బులో చదరంగం ఆడి తనివిచెందక తన ఇన్ని సంవత్సరాల అనుభవానికీ అజేయుడయిన యువక ప్రతిస్పర్థిని వెంటపెట్టుకొని వచ్చి ఇంటిదగ్గరే ఎత్తుపై యెత్తు ఆరంభించాడు. ఆట మంచి కటాకటీగా ఉన్న సమయంలో సువర్ణ వచ్చి, 'మామయ్యా, ఆ రైతులు రైలుకి వెళ్లిపోవాలిట, నీతో మాట్లాడాలి అంటున్నారు' అంది. సాంబమూర్తికి ఆటలోనుండి లేవడం ఇష్టంలేదుగాని, తప్పనిసరిగా లేచేడు. సువర్ణ 'పోనీ, నీఆట అందాకా నేను ఆడుతూఉంటానులే' అంది. ఆయన నవ్వుతూ, 'బాగుందమ్మా, నేనే సరిగా ఆట నిలబెట్టలేక మూడురోజులనుండి తంటాలుపడుతూ ఉంటే నువ్వు ఆడడమా' అంటూ హాలులోకి వెళ్లిపోయేడు.

ఆయన వెళ్లిపోయినా, సుందరం చదరంగం బల్లమీదనుండి మొగం ఎత్తలేదు కొంతసేపటివరకూ. ఆమె, ఇక మరి లాభం లేదని, గంభీరంగా ముఖం పెట్టి, 'ఇదేనేమిటి సార్, యూనివర్సిటీ పరీక్షలకి తయారవటం?' అంది. లోపల్లోపల ఆమెకు, తనలాగే కాదు, తనకంటే కూడా కాలహరణప్రవీణుడయిన వ్యక్తి ఉన్నాడనే తుష్టిలవము లేకపోలేదు.

రాని నవ్వును బలవంతంగా తెచ్చుకుంటూ 'ఇదొక్కటే అయితే బాగానే ఉండును. ఇంకా

ఇల్లాటి తలతిరుగుడుపనులు ఎన్నెన్నో ఉన్నాయి. ఏం చెయ్యమన్నారు, దేనిమట్టు కదే అవసరంగా, తప్పనిసరిగా ఉంటుంది అప్పటిమటుకు'—అన్నాడు ఆదివర కెంతో పరిచయం ఉన్నట్టు.

తిరిగీ సాంబమూర్తి వచ్చేక ఆమె మరి ఆట ఆడనివ్వలేదు. 'సరిగా నెల్లాళ్లయినా లేవు తెలుసునా మా పరీక్షలు. ఎంత తెలివయినవాళ్లయితేమాత్రం ఇలా దీక్షగా చదరంగం ఆడుకుంటూకూర్చుంటే—' అని సాభిప్రాయంగా ఆగింది.

'ఏమిటీ, మీరు కాలేజీలో చదువుతున్నారా?' అన్నాడు సాంబమూర్తి అప్పుడే తెలివివచ్చినట్లుగా.

'ఆఁ, మేమిద్దరమూ ఒకటే క్లాసు. ఆప్షనల్సు (ప్రత్యేక విషయములు)కూడా సమానమే' అన్నారు ఉభయులున్నూ.

—'అయితే ఈ నెల్లాళ్లూ మీరిద్దరూ కలిసి చదువుకుంటేనో' అన్నాడు సాంబమూర్తి సూచనగా.

ఆమె సాభిప్రాయంగా అతని వంక చూసింది.

అతడు నిర్మొగమాటంగా 'మీ అభిమానానికి కృతజ్ఞుణ్ణి. కాని నాకు ఒకరితో కలిసి చదవటం అలవాటులేదు. రాత్రి ఒంటిగంటప్పుడయినాసరే, నేను ఒంటరిగా చదువుకుంటేనే నాకు చదివిన కాస్తా అర్థమవుతుంది. పైగా నాకు మరొక బాధ్యతఉంది. నా పరీక్ష ఏమయినాసరే, మా నూర్యాన్నిమాత్రం పాసుచేయించాలి' అన్నాడు.

'ఎవరు? ఎప్పుడూ సూటు వేసుకొనే ఆ పొడావు—'

'అవును. వాడే అసలు ఈ సంవత్సరం నా కాలక్షేపం వడిదుడుకులు లేకుండా సాగడానికి వాడే కారణం. అంచేత ఎల్లాగో ఒకలాగు వాణ్ణి ఈ నెల్లాళ్లూ కష్టపడి తయారుచెయ్యాలి. అధమం, ఇంగ్లీషు తెలుగుల్లోనయినా వాణ్ణి పాసుచేయిస్తానని కంకణం కట్టుకున్నాను—'

'మంచికంకణమే—మరి మీ పరీక్షో?'

'వాడు పాసయితే నాకదే చాలును—నాకు ఎల్లాటి మార్కులువచ్చినా, చివరికి పరీక్ష ఏమయినా సరే నాకు విచారంలేదు.'

'మంచి పూనికే. ఇలా చదరంగంలో లీనమయితే ఆయనమాత్రం ఎల్లా ప్యాసవుతాడు?'

'అదే ఆలోచిస్తున్నాను. కాని ఎదురుగా చదరంగం కనిపిస్తూఉంటే నాకు తక్కిన ప్రపంచకమే అక్కరలేదు. సరేకాని, పంతులుగారూ శలవు, ఆట సుమారు పూర్తయినట్టేకదూ, ఇక మూడెత్తులలో వేసి రాజు ఆటకట్టు; శలవు, వస్తానండి'అంటూ చరచరా వెళ్లిపోయేడు.

ఆమె చాలా అభిమానపడ్డది. తాను ఇంతగా మాట్లాడాలనీ, కలిసి చదువుకోవాలనీ కుతూహలం చూపిస్తూ ఉండగా, అంత నిర్లక్ష్యంగా వెళ్లిపోవడమా? తానేమీ మొద్దుపిల్ల కాదే; ఫస్టుక్లాసు వస్తుందేమోనని ఆశకూడా పెట్టుకొంటున్నదికదా!

ఆమె అతిదీక్షగా చదువు సాగించాలనే ప్రయత్నించింది. కాని ఆమెప్రోద్బలము ఏమీ లేకుండానే క్రమక్రమంగా సుందరాన్నిగూర్చిన ఆలోచనలు ఎక్కువ కాసాగేయి ఆమె మనస్సులో.

నాలుగురోజులు పోయినతరువాత మట్టమధ్యాహ్నపు ఎండలో, చెమటలు కక్కుకుంటూ వచ్చేడు సుందరం. ఆమె చాలా ఆశ్చర్యపడ్డది అతని వాలకం చూసి.

'నానోట్సూ, తన టెక్స్టూ కలిపి పారేశాడట మా నూర్యం. బహుశః పరీక్షలదగ్గరకదా అని ఎవరో స్నేహితులే సంధించిఉంటారు—మీ డ్రామా టెక్స్టూ, నోట్సూ ఒకపర్యాయం ఇస్తే రాత్రి కావలసిన ముఖ్యాంశాలేవో తీసుకొని రేపటి కిచ్చేస్తాను.'

'బాగానే ఉందండీ, పరీక్షలముందెవరయినా పుస్తకాలివ్వగలరా? అందులోనూ మీరే చెప్తున్నారు మీ పుస్తకాలెవరో సంధించారని, నావాటిగురించి మాత్రం అంతకంటే నిబ్బరం ఏమిటి?'అంది సోల్లాసంగా సువర్ణ.

'అవును నిజమే, ఎవరికయినా అనుమానం ఉండవలసిందే. అందులోనూ నేను పరధ్యానంగా మరిచిపోయి ఊరుకుంటే మీ రనవసరంగా శ్రమపడవలసి

వస్తుంది'అంటూ తన పని అయిపోయినట్లుగా వెనక్కి తిరిగేడు.

ఆమె తడబడుతూ 'ఉండండి, పుస్తకాలు తీసుకొనివస్తాను'అంటూ తన గదిలోకి వెళ్లింది.

అతడు కొంచెం ఆశ్చర్యపడి నిలబడ్డాడు. ఆమె పుస్తకాలు తెచ్చి టేబిలుమీద ఉంచింది. అతడి వైఖరి చూస్తే, ఎక్కువసేపు మాట్లాడాలనికాక, వెంటనే పుస్తకాలు తీసుకొనివెళ్లి పోవాలని ఉన్నట్లుగా రూపించింది. అతని తొందరను గమనించిన ఆమె 'మీ నోట్సులన్నీ నాకు ఇస్తానని మాట ఇస్తేనే' అంటూ పుస్తకా లతని చేతిలో ఉంచింది.

అతడు 'అలాగే, తప్పకుండా, సాయంకాలం హోటలుకి వెళ్లినప్పుడు మోడరన్ పొయిట్రీనోట్సూ, నాండీటైల్డు ఎస్సేలూ ఇస్తాను'అని మరి ఆమెమాట విని పించుకోకుండానే వెళ్లిపోయేడు.

పరీక్షలవేళకు వారి పరిచయం మరికొంత బిగుసుకుంది.

ప్రతిపరీక్షకూ రానని ఎంతో మురిపిస్తూ సుందరంబలవంతంమీద కూర్చొన్న సూర్యం పాసయే డంటే, అది కేవలం సుందరంఆత్మశక్తే అనడాని కెట్టి సందేహమూ లేదు.

సుందరం కాలేజీకి రెండవవాడుగా పాసయేడు. పాపం, సరిగా సమయానికి వచ్చిన జ్వరంతో బాధ పడుతూకూడా సువర్ణ ఇంగ్లీషు తెలుగు పరీక్షలకు హాజరయింది. తక్కినవాటికి కదలడానికి వీల్లేనంతగా జ్వరం ఎక్కువకావడంవల్ల ఆమెపరీక్ష పూర్తి కాలేదు.

రెండునెలలు పైగా వేధించిన జ్వరం బాగా తగ్గినతరువాత ఆమె సుందరానికి కబురుచేసి 'మొన్నటి పరీక్షలకు మీ సూర్యంగారిని తయారుచేసినట్లుగా, నన్ను రేపటి సెప్టెంబరు పరీక్షలకు తయారుచేసే బాధ్యత మీది' అంది.

అతడికి దిగ్భ్రమ కలిగింది—'వాడికోసం నేను కష్టపడలేదననుగాని, అందులో నా స్వార్థం చాలా ఉంది. వాడికి బాగా బోధపరచటంకోసం నేను బాగా చదువుకోవడమేకాక, అసలు ఒక్కపుస్తకమయినా నేను కొనలేదు; కాలేజీవాళ్లిచ్చిన స్కాలర్‌షిప్పు తప్ప తక్కిన నా ఖర్చంతా వాడే పెట్టుకున్నాడు.'

'కావచ్చును—నన్ను తయారుచెయ్యటంలో మటుకు స్వార్థం ఉండకూడదా ఏమిటి? నేనూ మీ శ్రమను వృథాపోనివ్వను; మీ సహాయం ఉంటే-'

'డబ్బుగురించా, ఊరికినే సరదాకి అన్నాను- అంత కేవలం డబ్బుకోసమే అయితే ఇంకా చాలా విధానా లున్నాయి. సరేలెండి, మీరు సహజంగానే ఫస్టుక్లాస్‌తో పాసవవలసినవారుకదా, మీకు ఒకరి సహాయం ఏం ఉపయోగిస్తుంది? ఏమో, నాకుమాత్రం ఒకరు చెప్పినకంటె నేను చదువుకుంటేనే ఏదైనా బాగా బోధపడుతుంది.'

'అదంతా నా పూచీ; మీరు ఇష్టపడితే చాలును.'

—సెప్టెంబరులో ఆమె బి. యే. పూర్తయేక, కొంతకాలము దేశమంతా తిరిగి, తరవాత ఇద్దరూ యం. ఏ., బి. యల్. చదవాలని ఊహ. తక్కినవన్నీ కుదిరేయిగాని, ఆమె బి. యే. చదువుమాత్రం పూర్తి కాలేదు—ఆ అవసరంకూడా కనబడలేదు.

ఆ సంవత్సరాంతాన సువర్ణా సుందరములు భార్యాభర్త లయేరు.

అతడు యం. ఏ., బి. యల్. చదవుతూ చదువుతూ మానివేశాడు, ఆమె మేనమామ సాంబమూర్తి డబ్బు పంపడంలో చేసిన అశ్రద్ధను ఆమెఔదాసీన్యంగా అపార్థం చేసుకొని.

ఆ తరువాత సువర్ణ అతనిని ఎంతో బ్రతిమాలింది, మళ్లీ చదవమని. అతడుమాత్రం మరి అంగీకరించ లేదు.

పోనీ, మానివేసినవాడు నిర్విచారంగానయినా కూర్చున్నాడా అంటే అదీ లేదు. ఏవేవో నానా రకాల ఉద్యోగప్రయత్నాలు. ఆమె చాలాసార్లు అతన్ని బెదిరించింది, మీరు ఉద్యోగం చేస్తే నేను ఆత్మహత్య చేసుకుంటానని.

'మరి నన్నేం చెయ్యమంటావు సువర్ణా, నీ డబ్బు తింటూ, ఆ తిన్నదయినా అరగకుండా చేతకాని దద్దమ్మలాగ కూర్చుంటావా?' అనేవాడు సుందరం.

'అదేమి మాటలండీ, నా డబ్బని నేనెన్నడూ అనుకోలేదు. నా చిన్నతనంలో కొన్నాళ్లు మా నాన్నగారి డబ్బు; ఆ తరవాత కొన్నాళ్లు మా మామయ్యది; తరవాత మీది—అంతే. దానితో నాకు పూచీ లేదు.'

ఆత్మప్రతిష్ఠాపరుడయిన సుందరానికి అంత మాత్రంలో తృప్తికలగలేదు.

'పోనీ, మీరేదయినా వ్యాపారం చెయ్యండి. అందుమీద వచ్చిన లాభంతో మనం కాలక్షేపం చేద్దాము. అసలు డబ్బు ముట్టుకోకుండా' సుందరానికి ఈ అభిప్రాయం నచ్చింది. కేవలం ఒకరిక్రింద నౌఖరీ చెయ్యడం కాదు. అలాగని పనిలేకుండా ఆర్జన లేకుండా కూర్చోడమూ కాదు. బాగానే ఉంది అనుకొన్నాడు.

స్వదేశీవస్తువుల వ్యాపారం, ముద్రాయంత్రము, వారపత్రిక-అన్నీ ఆలోచనల్లో అద్భుతంగా ఉన్నాయి. కాని, తీరా అడుగుపెట్టేసరికి, వాస్తవికవ్యావహారిక జగత్తులో కష్టనష్టాలను ఎదుర్కొనే శక్తి లేకపోయింది సుందరానికి. లాభాలేమో తాను ఊహించినకంటే ఎక్కువగానే వస్తున్నట్టు కనబడేదిగాని, అవేవో క్రొత్తక్రొత్త తప్పనిసరి ఖర్చులూ, పెట్టుబడులూ! ఎప్పుడూ డబ్బు ఏమీ తేలేదికాదు. కాని సుందరం అట్టే తెలివితక్కువవాడు కాడు. నష్టం వస్తున్నదని గమనించగానే అతిచమత్కారంగా ఎక్కడిదక్కడ తెగగొట్టి సర్వవ్యాపారాన్నీ ఉపసంహరించేడు.

వ్యాపారాన్ని కట్టిపెట్టేస్తున్న రోజుల్లోనే అతడు ముచ్చటగా మూడు కథలు రాశాడు—తననే ప్రధానపాత్రగా చేసుకొని, తనచుట్టూ ఉన్న వాతావరణాన్ని, స్నేహితులను తన ప్రత్యేకదృక్పథంనుండి పరిశీలిస్తూ. మూడుకథలూ తన జీవితంలోని మూడు విభాగాలకు చెందినవి. వాటిలో ఏయే ప్రత్యేకలక్షణాలు ఉన్నా లేకపోయినా, సహజత్వానికీ సారళ్యానికీ లోటులేదు. పైగా కథావస్తువుకూడా అంత నీరసమయినది కాదు.

ఏమయితేనేమి, అతని మూడుకథలకూ రాదగినకంటే ఎక్కువగానే పేరుప్రతిష్ఠలు వచ్చేయో, లేక ఆరంభంలో ఎవరు ఏమాత్రం పొగిడినా అతిగా కనిపించేదో సుందరానికి, తాను ఏమయినా ఏమికాకపోయినా—అసమం ఒక రచయిత ననుకొన్నాడు. తన భావికృషిపాత్రము సారస్వతక్షేత్రమే అని నిశ్చయించుకొన్నాడు.

కాని, తీరా అతను రచయిత ననుకొని, తీర్చిదిద్ది వ్రాసేసరికల్లా అతని రచనల్లో మెచ్చుకోదగిన అంశాలతోపాటు చాలా లోటుపాట్లుకూడా కనిపించసాగాయి విమర్శకలేఖినులకు. అది సుందరంకాక మరెవ్వరయినా అయిఉంటే అతిసామాన్యంగా లెక్కచేసిఉందురు. కాని వయసుతోపాటు సుందరంలో అసహనంకూడా ఎక్కువ కాసాగింది. ఏమాత్రపు నిరుత్సాహకర విమర్శనకూ తాళుకోలేకుండానే కాదు, తాను ఆశించిన ప్రోత్సాహమూ, ప్రశంసా ఆశించినకంటే ఒకింత తక్కువగా వచ్చేసరికల్లా ప్రపంచం అంతా తనను అవహేళన చేస్తున్నట్లుగానే, తనను తన అశక్తికి ఎత్తిపొడుస్తున్నట్లుగానే ఉండేది.

ఎంతోకాలం స్నేహితులుగా ఒకరినొకరు అన్ని దృక్పథాలనుండి పరీక్షించుకొన్నవారే వారిద్దరూను—పరిచయంగా, మైత్రిగా, బంధముగా వారి స్నేహలత కొనలుసాగి ననలెత్తి తావులెలసి వెలసిన వెనకనే వారు భార్యాభర్తలయేరు. ఇక ఈ స్నేహమూ, ఈపరస్పరాకర్షణా ఇవన్నీ దృఢంగా నిలబడతాయన్న విశ్వాసం కుదిరిన వెనకనే వివాహబంధాన్ని వరించేరు వారు ఉభయులున్నూ.

పెళ్ళిఅయిననాటినుండి అదేదో విభేదము వారి నడుమను ఏర్పడినట్లయింది. బంధములేని ఆ తొలిరోజులలోని లాలస క్రమంగా నిర్బంధముగా తోచేదేమో. ఆమె ఏదో మారిపోతున్నదనే కాదు, తాను యద్విధంగానూ ప్రయోజకుడు కాకపోవడంవల్ల ఆమెకు తనమూలంగా ఆనందలేశమయినా కలగటం లేదనీ,

తనమూలంగానే ఆమె ఎంతో సౌఖ్యాన్ని కోల్పోతున్నదనీ సుందరం అభిప్రాయం.

నిరుత్సాహం అనేది మానవుడిలో పొడసూపకనే పోవాలిగాని, అది ఒకమారు పాదుకొందీ అంటే క్రమంగా ఇతరభావన లన్నిటిమీదా తన ముద్రను బలంగా హత్తగలదు. క్రమక్రమంగా, తాను అని ఒక వ్యక్తి లేకపోతే సువర్ణ ఇంతకంటే ఎంతగానో ఆనందించగలిగిఉండుననీ, ఇక తక్కిన లోకానికికూడా తన అవసరం ఏమీ ఉన్నట్టుగా లేదనీ, అందువల్ల తాను విశ్వనాటకరంగమునుండి ఎటువంటి అలజడీ లేకుండా నిష్క్రమించటమే ఉచితోచితమనీ భావించే స్థితికి వచ్చేడు సుందరం.

అదివరకే సూక్ష్మరూపంలో ఉండినా, వివాహమయిన ఉత్తరక్షణమునుండి సువర్ణ జీవితంలో ఒక క్రొత్తలక్ష్యము ప్రస్ఫుటమయింది. అది ఏదంటే సుందరాన్ని కేవలం సుందరంగాకాక భర్తగా ఆరాధించటము. ఆమెవైఖరిలోని ఈ క్రొత్తపద్ధతి అతనికి అర్థం కాలేదు. తననుగూర్చి ఆమె ఎక్కువగా కష్టపడుతున్నదేమోనని, తనకుకాక ఇంకెవ్వరినయినా ఆమె వివాహంచేసుకొనిఉంటే ఆమె చాలా ఆనందించగలిగిఉండునన్న అనుమానంతోనే అతడు నిత్యమూ ఆకుల పడుతూఉండేవాడు. అతనిని సరిగా ఆనందింప జేయలేకపోతున్నందుకుగాను ఆమెకూడా మథనపడుతూనే ఉండేది. కాని ఇద్దరూ సౌమ్యత్వానికీ, నాగరకతకూ ఒకరికి ఒకరు తీసిపోయేవారు. కారు. కాగా, తాము అతిఅన్యోన్యంగానే ఉన్నట్టు లోకాన్ని నమ్మించే విషయంలో ఇద్దరూ అద్వితీయులే.

తనవద్దకూడా ఎంతగా దాచినా, ఆమె అతని అసంతృప్తిని గుర్తించగలిగేది. “ఆమెఎన్నో పర్యాయములు అంది—నాపేరను భూములూ, వ్యవహారాలూ అన్నీ ఉండటం చాలా అసహ్యంగా ఉంది. చీటికీమాటికీ నాపేరునే అన్ని కాగితాలూను. ఒక మంచిముహూర్తం చూసి అన్నీ మీపేరుకి మార్పించేస్తా”నని. అతడు చాలా తేలికగా, ఉల్లాసాన్ని ప్రకటిస్తూ, ‘ఎందుకు పోనిద్దూ, ఇప్పుడంతటి అవసరం ఏమివచ్చింది ? ఇప్పుడు నీకుగాని నాకుగాని ఏమైనా ఇబ్బందిగా ఉందిగనకనా ?’ అనేవాడు. ఆమె తాత్కాలికమయిన అతని సమాధానంతో తృప్తిపడి ఊరుకునేది. అతని మనస్సుకూ తెలిసేది ఆమెలో ఎట్టి కల్మషచ్ఛాయా, కృతకత్వలవమూ లేదని. కాని అతని మనస్సుమాత్రం ఒంటరిగా ఉండేసరికల్లా ఏమేమో ఆలోచించకుండా ఉండలేకపోయేది.

ఎంతగా పాదుకొనిపోయిన కల్మషమయినా సరే, ఉవ్వెత్తుగా పొంగిపారలే స్రోతస్వినిలో కొట్టుకొనిపోయినట్లుగా, తన హైన్యాన్ని గూర్చి, అసామర్థ్యాన్నిగూర్చి ఎన్నిఎన్ని వింతయోచనలను కలిగినా, నిత్యమూ సువర్ణముఖంనుండి వెలువడే స్మితామృత తరంగాలలో తలమున్కలు కాకుండా ఉండలేకపోయేది అతని మనస్సు. ఆ ఆనందసుషమవెనుక లోపల్లోపల విషాదనీరదాలు ఉండినా ఆమెకుమాత్రం గోచరించే సావకాశం ఏదీలేదు.

3

అనుదినమూ, అనుక్షణమూ ఎన్నెన్నో మాటపట్టింపులూ, అభిప్రాయభేదాలూ వస్తూఉండినా పద్మావసంతముల దాంపత్యములో అంతకంటే ప్రబలమయిన విభేదము ఏదీలేదు. మొత్తంమీద ఇద్దరూ ఉల్లాసంగా జీవితం గడపడమే తల్లక్ష్యమని నమ్మేవారే—కాని, ఆ లక్ష్యసిద్ధికి అనుసరించే పథాలలోనే విభేదము. కాని, ఆరకం విభేదాలు ఎంత తరుచుగా వచ్చేవో అంత తేలికగా అంతరించేవి. మొత్తంమీద వారిది అనుకూలదాంపత్యమనే చెప్పవచ్చును. అ ఆనుకూల్యమునకు వారి ఉభయుల ఆర్థికసంపత్తికూడా ఎంతో దోహదం చేసింది.

పరిస్థితులు ఎప్పుడూ ఒక్కలాగే ఉండవు. తన ఇష్టంకంటే సుందరం బలవంతాన్ని ఆధారంగా చేసుకొని సువర్ణ బయలుదేరింది చెల్లెలు పద్మకు జబ్బుగా ఉందంటే. మొదట్లో సుందరం తానూ బయలుదేరేడుగాని, చిట్టచివరకు టిక్కెట్లు తీసుకొనేవేళకు తనకూ ఎంతో ఆతృతగా ఉన్నా తాను ఇంటిదగ్గరే ఉండి చేయవలసిన పని చాలా ఉండడంచేత తాను ఆగిపోవలసిఉందన్నాడు. కొంతసేపు సువర్ణ అతన్ని ప్రోద్బ

లము చేసిందిగాని, అతడి నైశ్చల్యానికి లొంగిపోయి, 'నేనూ అట్టే ఉండను—కొద్దిలో ఏమాత్రమయినా నయంగా ఉంటే వాళ్ళను ఇక్కడికే తోడుకొని వస్తా'నని చెప్పి రైలెక్కింది.

క్రమక్రమంగా రోగిని కదపడానికి వీలులేని పరిస్థితిలో కొన్ని నెలలు గడిచేయి. ఎల్లానయితేనేం, రోగం తిరుగుమొగం పట్టింది. ఈలోపున పద్మభర్త వసంతం రాసిన కృతజ్ఞతాలేఖలకు ఒక అంతులేదు. కొన్నాళ్లపాటు చదివిచదివి సుందరం వాటిని చదవడం మానుకొన్నాడు.

సువర్ణ వ్రాసింది—'౨౫. తేదీ రాత్రి బండిలో అక్కడికి వస్తున్నాము'అని. అదే భోగట్టా వైరుకూడా వచ్చింది.

ఆ వేళ మధ్యాహ్నం వైరువచ్చిన దగ్గరనుండి సుందరం మామూలుకంటే ఎంతో ఉత్సాహంగా ఉన్నాడు. అప్పటినుండి అదేపనిగా గదిలో అటూ ఇటూ పచారుచెయ్యడం ఆరంభించాడు. మధ్యమధ్యను టేబిలుమీదో, మంచంఅంచునో ఒక్కక్షణం కళ్లు మూసుకొని కూర్చొనేవాడు. మళ్ళీ లేచి, ఇనుమడించిన త్వరతో నడక మొదలుపెట్టేవాడు.

రాత్రి పండ్రెండుగంటలకు రయిలు రావలసి ఉన్నా సాయంకాలము ఏడుగంటలకే కారు స్టేషనుకి తీసుకొనివెళ్లా లన్నాడు సుందరం.

కారుడ్రయివరు వెంకట్రావు ఏడుగంటలకు సర్వం సిద్ధంచేసుకొని, వినయంగా అతనితో మనవిచేసుకొన్నాడు.

'ఇంకా నువ్వు వెళ్ళలేదా? బండీ ఎప్పుడు వస్తే నీకేమి'అని గొంతు తగ్గించి, నెమ్మదిగా బోధపరుస్తున్నట్టుగా 'చూడూ, వెంకట్రావు, రయిళ్ళ సంగతినమ్మలేము. ఒకొక్కొక్కప్పుడు గంటలకొద్దీ లేటుకావచ్చునుగాని, ఒకొక్కొక్కనాడు సరీగా వేళకి వచ్చేస్తాయి. అయినా మనకు ఇక్కడ వేరే చెడిపోయే పని లేనప్పుడు అక్కడికే వెళ్లిఉండటం మంచిదికాదూ? నువ్వు వెళ్లు—నాకుగాని, నిద్రరాకపోతే నేను పదకొండు పన్నెండు ఆప్రాంతంలో సైకిలుమీద బయలు దేరివస్తాను; నువ్వు వెళ్లు'అన్నాడు.

సుమారు రాత్రి ఎనిమిదిగంటల ప్రాంతంలో వైద్యుడు నారాయణశాస్త్రిగారు వచ్చేరు. ఇన్నిసంవత్సరాల అనుభవంలోనూ ఆయన ఎన్నడూ సుందరాన్ని అంత ఉత్సాహంగా చూడలేదు. తనంతటతాను ఎన్నో విషయాలు చర్చించి స్వయంగా మందడిగి తీసుకొన్నాడు. భోజనంకూడా రోజూకంటే తృప్తికరంగానేచేసేడు. ఆనాటి అతని హుషారు ఆరునెలలు కనబడకుండా, ఇతరకృత్య నిర్వహణంలో నిమగ్నురాలయిన భార్య విజయవంతంగా తిరిగివస్తున్న దన్న ఆలోచన వల్ల కలిగిందని సామాన్యంగా అర్థంచెప్పవచ్చును. కాని, అర్థాలకేమి, ఒక్క భగవద్గీతకు బహుభాష్యాలు; ఒకొక్కొక్క భాష్యానికి అనంతమయిన వ్యాఖ్యానాలు. అలాగే మానవుల ప్రవర్తనకుకూడా ఎన్నిరకాలుగానో అర్థం చెప్పవచ్చును. కాని ఎన్ని అర్థాలు ఎంత తెలివితేటలుగా చెప్పినా, ఏఒక అర్థంకూడా మూలాన్ని పూర్తిగా విస్పష్టంగా తెలుపలేదు. అది కేవలం వ్యక్తుల తరహాల ననుసరించి కేవలం ఊహావలనమాత్రమే తెలియవలసినది.

రాత్రి తొమ్మిదిగంటల ప్రాంతంలో అతడు పడకకుర్చీలో కూలబడ్డాడు. ఇక మరి ఒక్క మూడు గంటలే ఉన్నాయన్నమాట తననూ, సువర్ణనీ ఎడంగా ఉంచడానికి. కాని, దగ్గరగా ఉన్న కాలమంతా తామిద్దరూ సంపూర్ణంగా కలిసేఉన్నారా? లేదు, లేదు. ఏదో ఒక బ్రహ్మాండమయిన అగడ్త తమఇద్దరినీ దూరదూరంగా ఉంచేస్తున్నది—అది అంతరించడ మెలాగు??

అతని మనస్సు క్షణానికి ఎన్నెన్నో వేలపర్యాయములు పరిభ్రమించే యంత్రంకంటే వడిగా పనిచేయసాగింది.

గడియారం పదిన్నర కొట్టుతూఉండగా అతడు ఏదో నిశ్చయానికి వచ్చినట్లుగా కుర్చీలోనుండి లేచేడు.

ఒకమారు క్రిందకు దిగి, అంతా సరిగానే ఉన్నదనుకొని, అతడు గదిలోపున గడియవేసుకొని, పుస్తకాల బీరువా తలుపుతీసేడు.

మధ్యఅరలోని పుస్తకాల నొత్తిగిలించి, వాటి వారనున్న చిన్నసీసాను బైటకితీసి అస్ఫుటంగా ఉన్న

దీపపువెలుగులో సంతృప్తికరంగా చదువుకొన్నాడు సీసా పేరు. సందేహ మేమీ లేదు— పోటాసియమ్ సైనేడు.

సదరహాసంగా వెళ్ళి టేబిలుమీద సీసా ఉంచి, అదివర కెన్నడూ ఎరగనట్లుగా తనను అద్దంలో పరీక్షగా చూసుకోసాగాడు.

అత నలా నిలబడిఉండగానే పదకొండు కొట్టింది గడియారం. అతడికి చాలాకోపంవచ్చింది—తాను చేయవలసిన పని ఇంకా చాలా మిగిలిఉండగానే వేళ అయిపోవడమేమా అని.

బీరువా తీసి చూసుకొన్నాడు - ఓహోహో, ఎన్ని కాగితాలు, ఎన్ని పుస్తకాలు. అన్నీ తన చేతితో చెక్కిన అక్షరాలతో నింపినవే. అక్షరం-ఎంత చక్కటి మాట! నాశనం లేని దట-ఆ అక్షరాలను సమకూర్చిన మానవుడో-అతని మేధాశక్తో?-ఇది అక్షరమా, క్షరమా?

ఆలోచన సాంతం కాకుండానే, డైరీ తీసి, అందులో ఆరోజు కాగితం తీసి, 'అంతిమనిశి' అని కుదురుగా వ్రాసి, తీరుగా సంతకంచేసి, పుస్తకం మూసి టేబిలుమీద ఉంచేసేడు. మళ్ళీ ఆలోచించి, పుస్తకం తెరిచి, తానప్పుడు వ్రాసినది ప్రస్ఫుటంగా కనబడేట్లు ఉంచి, వేరే కాగితంమీద ఉత్తరం వ్రాయటం ఆరంభించేడు. ఉత్తరం వ్రాయబోతూఉండగా, వేళ్లు వణకడానికి అతడు నవ్వుకొని, తనకు తానే ధైర్యం చెప్పుకొన్నాడు. అతడు ఎంత యత్నించినా, అక్షరాలు కొక్కిరిబిక్కిరిగానే తయారయేయి.

"సువర్ణా!

జగత్తులో ఎన్నెన్నో విపరీతాలు జరుగుతూ ఉంటాయి. వాటిలో ఒకదానిని మనము ఎదుర్కోవలసివచ్చింది.

నేనే ఏవిషయంలోనూ, ఏమాత్రమూ ప్రయోజకుణ్ణి కాలేకపోయేను.

ఉత్సాహస్వరూపిణి వయిన నీవల్లకూడా నన్ను అంటిపట్టకొని ఉండే నిరుత్సాహపుముద్రలు తొలగలేదంటే, నన్ను ఆనందపరచడమన్నది లోకంలోని ఇతరుల కెవ్వరికీ సాధ్యముకాదనుకుంటాను.

అన్ని విషయాలలోనూ, నీవు నా కిచ్చినదాంట్లో వెయ్యోవంతుకూడా, నీకు నేను ఇవ్వలేకపోయేను. ఈజన్మలో మరి ఇవ్వలేనుకూడా. తరువాతి సంగతేమిటో?

నువ్వు ఈదుర్బలుణ్ణి ఎంతత్వరగా మరిచిపోగలిగితే అంతఎక్కువగా ఆనందాన్ని సాధించగలవు.

ఏమి చేతనయినా, ఏమి చేతకాకపోయినా సర్వదా తన తృప్తితోపాటు నీఆనందాన్ని వాంఛించే-

హితుడు, సుందరం."

ఉత్తరం గాలికెగిరిపోకుండా, డైరీక్రింద ఉంచి, మళ్ళీ కుర్చీలో కూలబడ్డాడు. ఎట్టఎదురుగా విషపాత్రతో పెదవులకు విందుచేసే సోక్రటిస్ మహాశయుడు సాక్షాత్కరించేడు. సోక్రటిస్ వేత్త అంటున్నాడు-"మనం మనమన మార్గాల ననుసరిస్తాం. మీరు బ్రతుకుబాటను, నేను మృత్యుపథాన్ని. కాని, వీటిల్లో ఏది మేలైనదో భగవంతుడికే తెలియాలి."అని.

సుందరంధైర్యాం ఇనుమడించింది.

ఏది మేలో ఎవరికి తెలుసును-అది మంచిది కాదని ఎన్నడూ చూడకుండానే ఎల్లా నిర్ధారణచెయ్యడం? అతడు సీసాను పెదవుల సమీపానికి తీసుకొనివచ్చి, 'ఛ! ఇది బహు కళావ్యతిరేకమయిన పద్ధతి' అనుకొని, లేచి, వెండిగిన్నెలోని పాలలో సీసాలోని ద్రవం నాలుగుచుక్కలు వేసి, స్టూలు నడుమను గిన్నె ఉంచి మళ్ళీ పచారుచేయడం మొదలుపెట్టేడు.

గడియారం ధీమాగా పదకొండున్నర కొట్టింది. ఇక నొక్క అరగంటమాత్రమే వ్యవధి. మహాఅయితే ఒక గంటమాత్రమే, ఈలోపునే సర్వం అయిపోవాలి. హుఁ, అయిపోవడానికి ఎంతసేపు, కొద్దిక్షణాలు... అంతే.—

నిబ్బరంగా వెళ్లి పడకకుర్చీలో కూర్చొని స్టూలు దగ్గరకు లాగి, గిన్నె అందుమీద ఉంచి, వెనక్కు నడుము వాల్చేడు. మళ్లీ సోక్రటీస్ మహాశయుడు ఎట్టఎదురుగా ప్రత్యక్షమయేడు. ఏమిటోకదా ఈ సన్నిహితత్వం — రెండువేల సంవత్సరాల దూరం ఉంది జీవితపథంలో తమ ఇద్దరినడుమనూ. ఈ

సుదూరాన్ని అధిగమించిన సాదృశ్య మేమిటో? కేవలం విషపాత్రికేనా-ఇంకా ఏమైనా సాదృశ్యముందా? అతడికి—ఏవేవో ఆదర్శాలకోసం, ఆశయాలకోసం పశుబలాన్ని, హింసాశక్తులను ఎదుర్కొంటున్నా నన్న తృప్తిఅయినా అతడి కుంది. తన కేమితృప్తి—కేవలం జగత్తును, దాని దుర్భరవాస్తవికతను భరించలేక. అంతే కాదు. స్వశక్తి పూజ్యముకాగా, ఇతరులమీద ఆధార పడడం ఇష్టంలేక.

తన నిశ్చయానికీ, ప్రయత్నానికీ విరుద్ధంగా, యోచిస్తున్నందుకు అతనికి తన మనస్సుమీద ఆగ్రహం విపరీతంగా కలిగింది—అంతలోనే నవ్వుకొన్నాడు, గడియకో, క్షణానికో ఎన్నటికీ ఏమీ ఆలోచించ బోవని స్థితిని సమీపించబోతూకూడా ఇంకా ఏమేమో లౌకికబంధాలను గూర్చి ఆలోచించటం ఎందుకు?

ఇక కొద్దిక్షణాల్లో ఏమవుతుంది? ఏమీ కాదు-బల్లమీది పాత్ర తన పెదవులనూ, రసననూ స్పృశిస్తుంది.-అంతే. తరవాత ఏమో, అగమ్యగోచరం—కాదు కాదు, కొంతయినా ఊహించవచ్చును. మరొక్క గంటలో సువర్ణ సోల్లాసంగా వస్తుంది.—మొదట్లో ఆశ్చర్యపోతుంది-విచారిస్తుంది; తరవాత పశ్చాత్తాపపడుతుంది. పశ్చాత్తాపమా, ఎందుకో? ఆమె ఏమయినా తప్పుపని చేసిందా? లేదు నిజమే, లేదు నిజమే-అయితే ఆమె కెందు కీ శిక్ష?

ప్రత్యక్షంగా కాకపోయినా, పరోక్షంగా ఆమె తనను హింసిస్తూనేఉంది. ఇది బహుశః ఆమెకు తెలియకపోవచ్చును. ఆమెకేకాక, ప్రపంచంలో చాలామంది హింసించేవాళ్లకు హింసింపబడేవాళ్ల పరిస్థితి అర్థంకాదు. అర్థంచేసుకొనికూడా హింసించగల మనోదార్ఢ్యము గలవాళ్లు బహుకొద్దిమందే.

తాను చచ్చిపోతే ఆమెకు పశ్చాత్తాపం ఎందుకు? అథమం-విచారమయినా ఎందుకు కలగాలి?

ఆమె సామాన్యంగా అందరితోపాటు, తన చర్యను, స్వభావాన్ని ఖండఖండాలుగా విభాగించి విమర్శించవచ్చును.

ఆమె రేపే మరొకరిని—మరొకరిదాకా ఎందుకు, ఇటీవల పద్మ జబ్బుమనిషిగా తయారయిందికదూ, చెల్లెలికి ఉపచరించినట్టూ ఉంటుంది; బావ ఆనందానికి లోటులేకుండానూ ఉంటుంది. వసంతాన్నే వరించవచ్చును—నిరాటంకంగా, నిర్విచారంగా, నిశ్శంకంగా—

ఛ! సువర్ణలో అట్టి తలపు ఉందనుకోవడమా? తాను మరీమరీ బలవంతంచేసి వెళ్లమంటేనే వెళ్లింది. అయినా—

అతిప్రయత్నంమీద మనోవిహంగాన్ని ఎగరకుండా నిబంధించుకొని, కుర్చీలో ముందుకు వంగి, గది అంతా కలయజూచేడు. ఓహో, ఎన్ని పరిచితమయిన వస్తువులు-ఎన్నిఎన్నిరకాల రోజులూ అనుభవాలున్నూ! ఇవన్నీ ఏమవుతాయో—అతనికేమో అసంతృప్తిగాతోచి, లేచి వెళ్లి కిటికీతలుపు తెరిచేడు. శుక్లద్వాదశి చంద్రమఃఖండము కాంతితరంగాలతో రోదసిలో ఎక్కడా అంతరంలేకుండా చేస్తున్నది. క్రింద తోటలోని మల్లికాసుమపరిమళముతో మిళితమయిన నవ్వుతావి అతని ఘ్రాణేంద్రియానికి కితకితలు పెట్టింది. అతడు మళ్లీ నవ్వుకొన్నాడు-ఈ ఇంద్రియములను ఇప్పటికీ ఈ లౌకికవాసనలు విడిచిపెట్టవేమా అని.

తల పైకెత్తి చూసేడు-ఎదురుగా చంద్రబింబమూ, తారాగణమున్నూ. తాను ప్రవేశించబోయే ఆ లోకంలో చంద్రబింబం ఉంటుందో, ఉండదో. ఈ నక్షత్రాలు ఇవి ఇలా ఎంతకాలమునుండి ఈ అనంతమయిన పర్యటనాన్ని సాగిస్తున్నాయో!-ఆ నక్షత్రాల కొలతలలో చూసినప్పుడు తనవంటి ఎన్నెన్నో కోట్లమందికి ఆశ్రయభూతమయిన ధరాగోళమే అణుమాత్రమయినా కాదే-ఇక తా ననగా ఎంత? తనలోనే ఇన్ని కొనసాగని కోరికలూ, అందబోవని ఆశలూ ఉంటూఉంటే ఆ ఊహించలేనంతటి పెద్ద గోళాలలోనో! తనలో ఉన్న ఈ చైతన్యము వాటిలో లేక, ఏదోవాటిశక్తికి అతీతమయిన క్రమాన్ని అనుసరించి పరిభ్రమిస్తున్నాయా? తన చైతన్యస్రోతస్వినికిమాత్రం బలీయమయిన ఒక క్రమమూ, నియమతత్వం ఉండవా?

కొంతసేపటికి అతని మనస్సు ఏమీ ఆలోచించడం మానివేసింది. ఎట్టఎదురుగా ఏమిచూస్తున్నాడో కూడా స్ఫుటంగా గోచరించడంలేదు—అలా ఉండగానే గడియారం గంటలుకొట్టడం మొదలుపెట్టింది.—పన్నెండు. సరిగా రయిలువచ్చే వేళ. ఇకను మరొక అరగంటలోపున వాళ్లు వచ్చేస్తారు-వచ్చేలోపునే సర్వం సమాప్తమయిపోవాలి. మనుష్యులను చూస్తూఉంటే పిరికితనం మరీ ఎక్కువవుతుంది. నిశ్చయాలు సన్నగిల్లిపోతాయి.

తొందరగా మళ్లీ వెళ్లి కుర్చీలో కూలబడ్డాడు.

గిన్నె ఎత్తిపట్టుకొని, ఎల్లాగూ తాగేస్తున్నాను కదా, మరిరెండు నిమిషాలు ఆలోచిస్తేనేమి అనుకొని, గిన్నె స్టూలుమీద ఉంచి, కుర్చీలో వెనక్కు చేరబడి గట్టిగా కళ్లు మూసుకొన్నాడు.

కొన్నిసంవత్సరాలక్రిందటి సంఘటన - ఆవేళా ఇటువంటి వెన్నెలరాత్రే. ఒంటరిగా ఏటివంకకు వెళ్లుతున్న అరుంధతిని చూడగానే ఏమో అనుమానం కలిగింది.తన అనుమానం నిజమే-ఆనాడు ఆమెను సంరక్షించటంలో తానుపదేశించిన ధైర్యసాహసాలు ఆమెకే కాదు-తనకీ ఎంతో ఉపకరించేయి. అప్పట్లో తానూ ఆ స్థితిలోనే ఉండేవాడు. ఆనాడు ఆమెకు తాను జీవించటంలో ఉండే పరమార్థాన్నిగూర్చి ఎంతగానో బోధపరిచేడు. ఈనాడు తనకు అల్లా నచ్చజెప్పేవారు, బోధపరిచేవారు ఎవరూ లేరే? తనకు ఒకరు బోధపరచవలసిన అవసరం ఏముంది-తాను స్వయంగా ఆలోచించలేడా? తనవల్ల ఏమీ ప్రయోజనం లేదని నిశ్చయించుకొన్నవెనక నేకదా-ఆఁ, ప్రయోజనం లేకేమి-తానొక సచేతనుడయిన మానవుడయి ఉండికూడా—తానేమీ అశక్తుడుకాడే.అంగహీనుడు కాడే. తాను తనకోసమూ, ఇతరులకోసమూ చేయవలసిన పనులు ప్రపంచంలో లేనే లేవా ? ఒకవేళ తాను సువర్ణను ఆనందింపజేయలేకపోవచ్చును; కాని, ఇందువల్లమాత్రం ఆమె ప్రస్తుతం కంటే ఎక్కువగా ఆనందించగలదా? పోనీ, ప్రపంచం అంతటికీ ఆమె ఒక్కతేకాదే—ఇంకా, తన అవసరం ఉన్న, తన సహాయం పొందదగిన వ్యక్తులే లేరా?

అతని ఆలోచన ఎక్కువసేపు పట్టలేదు—నిండుగా గాలికొట్టిన రబ్బరు బంతిలా కుర్చీలోనుండి త్రుళ్లేడు అంత పొడవుమనిషీన్నీ.

డైరీ మార్చి మళ్లీ రాద్దామని చూసేడు. కాని, అంతటి ఆలస్యాన్ని భరించేట్టు లేదు అప్పటిస్థితి—పన్నెండూ ఇరవై-టిక్ టిక్ టిక్-అతిత్వరగా సంచలిస్తూంది కాలచక్రము.

బీరువామీదకు డైరీ విసరి, గబగబ మేడదిగి పరుగెత్తేడు షెడ్డులోనికి. ఇటీవల కొన్ని సంవత్సరాలుగా సైకిలు తీయని తాను సైకిలు తొక్కగలడా అన్న సందేహాళకలం అతని మనస్సులో మెరిసి, అతన్ని నవ్వించింది.

ఇంటర్‌మీడియేట్ చదివే రోజుల్లో సైకిలు పందేలలోకూడా అతనంత తొందరగా తొక్కలేదు.

ఊరుదాటినతర్వాత మూడుమైళ్ళకు అసలు రోడ్డులో దారికలుస్తుంది. ఈలోపున కారును ఎదుర్కొనక్కరలేకపోతే చాలును, తరువాత ఎంత మేరయినా నిర్విచారంగా సాగిపోవచ్చును.

దూరంగా కారుధ్వని వినిపించింది, అంత తొందరలోనూ అతని చెవులకు సైకిలుదిగి, ప్రక్కనున్న చెట్లమాటుకి వెళ్లిపోతేనో అనుకున్నాడు. వెంటనే, 'ఛ! అంత భయమెందుకు? నా ఇష్టం వచ్చినట్టు నేను వెళ్లిపోతాను. ఒకరి ఇష్టాయిష్టాలతో నాకేమి ప్రసక్తి? నన్ను అడిగేవాళ్ళూ, అడ్డేవాళ్ళూ ఎవరున్నారు ?'

కారు అడ్డుదారికి తిరగలేదు. తిన్నగా రోడ్డంట పరుగెత్తిపోయింది. అనుకోకుండానే అతని గమనం మందమయింది.

అతడు కొద్దిగజాలలో మలుపుతిరుగుతా డనగా, మళ్ళీ మంద్రమయిన ధ్వని వినిపించింది. ధ్వనిమాత్ర మే కాదు, దూరాన వెలుగు తళుక్కుమంది. ఈమారు సందేహం లేదు. కారువెలుగువల్లనే అతడికి తెలిసిపోయింది. మలుపుతిరిగి కొద్దిదూరంలో ఉన్న కానా గట్టుమీద ఆనుకొని వెనుక తిరిగిచూసేడు. కారు

నిండుగానే ఉన్నట్టుంది-కారు చెట్లవరుసల్లో మాటు పడినవెనుక, మళ్ళీ, తన అంతులేని, అవధిలేని ప్రయాణాన్ని సాగించేడు సోత్సాహంగా, ఏమో సాధించ గలిగేనన్న ధీమాతో.

ఇలా తాను ఎక్కడికి వెళ్తాడు, ఏం చేస్తాడు? ఎక్కడికయినా వెళ్ళగలడు-ఏమయినా చెయ్యగలడు. మానవుడి మేధాశక్తికీ, ప్రయత్నప్రాబల్యానికీ అతీత మయిన దేముంది? అరగంటక్రిందట మరి ఈ లోకంలో లేడు అనుకున్న మనిషికి ఎంతటి అవకాశం-ఓహోహో ఏమి అదృష్టము-కేవలం తనకేకాదు, తాను లోకం లోని ఎందరోమందికంటె మానసికంగా, శారీరకంగా చాలా సదుపాయములు కల పరిస్థితిలో ఉన్నాడు.

"ఈనాడు లేడు అనుకొన్న ఈ జీవి రేపు ఎందరికి ఎన్నివిధాల ఉపయోగించగలడో?" అతని మనస్సు పదేపదే అదేవిషయాన్ని ఒకింత మాటల భేదంతో ఆలోచించసాగింది—ఆ ఆలోచనతోపాటు ఉత్సాహముకూడా ఎక్కువయింది. ఉత్సాహముతో పాటు వేగముకూడా ఎక్కువయింది.

ఈసరికి కారు ఇంటికి వెళ్లి ఉంటుంది. డ్రైవరు వెంకట్రావు దారిలోనే చెప్పిఉంటాడు. తాను ఏడు గంటలకే స్టేషనుకి వెళ్లి సిద్ధంగా ఉండాలని చెప్పినట్టు. తాను ఇంట్లో లేకపోతే సువర్ణ ఏమనుకుంటుందో-ఏమి చేస్తుందో-పాపం తనగురించి ఎంతగా బాధపడు తూందో—అతని మనస్సులో ఠెళ్లున మెరిసింది. స్టూలు మీది పాలు - కాదు, కాదు, విషం-అలానే ఉండి పోయింది. సీసాకూడా టేబిలుమీదే ఉండిఉంటుంది. ఆఁఆఁ, ఎంతఘోరము!

ఈ జ్ఞాపకంతో హఠాత్తుగా వెనకతిరిగి ఇనుమ డించిన వేగంతో తొక్కడం మొదలుపెట్టేడు. ఎలా గయినా సువర్ణను సంరక్షించాలి—ఆనాడు తాను అరుంధతిని కాపాడగలిగేడు—ఈనాడు సువర్ణను, ఆమె తనదయినా కాకపోయినా, సంరక్షించాలి—ఏమో, అదృష్టం ఉందో లేదో.

తోటప్రక్కనుండి రావడంలో, తిరుగుడుదగ్గ సైకిలు దారిప్రక్కనున్న గుంటలోనికి దిగిపోయింది. దెబ్బతగిలిందో లేదో చూసుకొనే ఓపికకూడా అతనికి లేకపోయింది. చెక్కుకొనిపోయిన ముడుకులతో, బట్టలనిండా తుళ్ళిన బురదతోనే, అప్పటిదెబ్బతో అడుగడుక్కీ నడవనని మొరాయిస్తున్న సైకిలును కేవలం ఆత్మశక్తివల్ల నడిపిస్తూ అతను ఇంటికి చేరుకున్నాడు.

దారిలో ఎవ్వరి పలకరింపులూ, మాటలూ, ఏవీ వినిపించుకోకుండా పరుగెత్తి మెట్లెక్కి గది గుమ్మంలో నిలబడిచూసేడు. అనుకోడానికికూడా భయ పడినంత పని అయిపోయింది. ఒకగంటక్రిందట తాను కుర్చీలో కూర్చొనిఉన్నట్టే...కాదుకాదు, అప్పుడు తాను పూర్తిగా తెలివిగా కూర్చున్నాడు. టేబిలుమీది సీసా స్టూలుమీద ఉంది. గిన్నెలో ఏమీ కనబడలేదు. ఇన్ని సంగతులూ అతని మనస్సు జ్ఞానవంతమై గ్రహిం చిందని కాదు-ఏదో అస్పష్టమయిన ధోరణిని ఎవరో కలలో చెప్పినట్లుగా తోచింది.

అతనికి తానెన్నడయినా గట్టిగా అర్చి ఏడ్వ గలనా అని అనుమానం ఉండేది.

'సువర్ణా' అని గట్టిగా కేకవేసి నేలను పడి పోయేడు. ఆ కేకలో, మంద్రతారస్థాయిలను రెంటినీ అందుకొంది అతని గొంతు.

కారు రావడమే తడవుగా సువర్ణ మేడమీదకు వెళ్ళిపోయి, మరి క్రిందకు రాకపోవడంతో రెండూ మూడు రోజులనుండి సరిగా నిద్రలేకపోవడంవల్ల నిద్ర పోయిందేమో అనుకొన్నారు పద్మా, వసంతమూను. అసలు సుందరం అంత రభసంగా వచ్చేవరకూ అతను ఇంట్లో లేని సంగతే వారికి తెలీదు.

సుందరంఆగమనంతోనే కలవరపడిఉన్న వసంతం, మేడమీదనుండి సాతురమయిన సుందరం కేక వినబడగానే, ఒక్క దూకులో వచ్చేడు మేడ మీదికి. అడుగు తీసి అడుగుపెట్టడానికికూడా శక్తిలేక పోయినా, ఎల్లాగో గోరిసాయంతో మెట్లెక్కివచ్చింది పద్మ.

క్షణంలో నౌకర్లందరూ గుమికూడేరు. వసంతం వాళ్ళనందరనూ అవతలకు పంపి, సుందరాన్ని కదిపేడు, పరిస్థితి ఏమో అర్థంకాక. ఎలాగో దుఃఖపు

తెరలను తెమల్చుకొని, "ఆత్మహత్య చేసుకోవాలను కొన్న పిరికిపందను. నేను మానవుణ్ణి కాగోరి, పారి పోయేను ఇక్కడనుండి. మానవుణ్ణి కాగోరి రాక్షసుణ్ణ య్యేను. ఇంతకంటే హత్యచెయ్యడమంటే వేరే ఏముం టుంది?" అంటూ నేలకు ఒరిగిపోయేడు. అతడి తలను జాలిగా, దుర్బలంగా పట్టుకొంది పద్మ.

'అయితే, ఎలా చనిపోయిందంటారు?' అన్నాడు వసంతం కొంచెం కటువుగా.

'ఎలాగా, మహారాజులాగ. విషం తాగి చచ్చి పోయింది; పొటాసియమ్ సైనేడు తాగి చచ్చిపోయింది. అదుగో టేబిలుమీద సీసా' అని తలను నేలకు వేసి కొట్టుకోబోయేడు. పద్మకు ఎక్కడలేని శక్తి వచ్చింది అతని తలను పట్టుకుందికి.

ఒక్క అయిదునిమిషాలు ఏమీ మాట్లాడ కుండా సువర్ణను పరీక్షించి, మెల్లగా, పద్మతో 'బతికేఉం'దన్నాడు వసంతం, సగంమాటను సైగలతోనే తెలుపుతుచేస్తూ. అతను వారిస్తున్నా వినిపించుకో కుండా, పద్మ 'బ్రతికేఉందిట, బావా, అక్కయ్య' అంది సుందరం చెవులో.

ఆమాట వినడంవల్ల అతనిలో కలిగిన కలవర పాటు వర్ణనాతీతము.

చివరికి వసంతం-'ఎంతమాత్రమూ ఇది పొటాసి యమ్ సైనేడుకాదు, బహుశః బ్రోమైడయి ఉంటుంది. ఈమధ్యనల్లా సరిగా నిద్రలేకపోవడానికి తోడు ఇది తాగడంవల్ల మరీ బలంగా నిద్రవచ్చేసింది. అంతే.— ఆమె మామూలుగానే ఉంది; హాయిగా ఊపిరి తీస్తున్నది; మీ రెలా భయపడ్డారో నాకేమీ అర్థం కాకుండాఉంది' అన్నాడు.

అవసరం లేదని తెలుస్తూఉన్నా కూడా డాక్టరుకోసం పట్నం కారు పంపించేరు సుందరం, వసంతం కలిసి.

ఆ తరువాత ఒంటరిగా దొరికిన మొట్టమొదటి సావకాశాన్ని అతడు వినియోగించుకోకపోలేదు— "సువర్ణా, అయితే నిన్నటి నా చర్యనుబట్టి పిరికిపంద నంటావా, లేక రాక్షసుణ్ణంటావా ?"

"ఏమీ అనకూడదు-అన్నీ కలిసే ఉంటాయి మానవస్వభావంలో. కొన్నికొన్ని సమయాల్లో కొన్ని కొన్ని బైటపడుతూఉంటాయి—అయితే శరీరాలను కడుక్కుందుకి నీళ్లలాగ అవసరమో, మనస్సులను క్షాళ నము చెయ్యడానికి కన్నీళ్లూ అంత అవసరమే" అంటూ ఆమె మరి మాటలకు ఎడం లేనంతగా అతణ్ణి దగ్గరకు తీసుకొంది.

'మళ్ళీ మన మిద్దరమూ కొత్త జన్మ మెత్తేము గనక మనలెక్కలు మళ్ళీ ఈనాటినుండి మొదలు' అంటూ ఆమెను బలంగా ముద్దుపెట్టుకొన్నాడు, మానవుడయిన సుందరం.